
'హాయ్... మీనా... ఇవాళ నీ డ్రస్ అదిరిందనుకో... ఎంతో బాగుంది. వెల్... ఈ రంగు డ్రస్‌లే వేసుకో... నా మనస్సు దోచుకో...' సురేష్ చిరునవ్వుతో అన్నాడు.

ఆ పొగడ్తకి పొంగిపోయింది మీనా. సిగ్గు పడుతూ... 'ఊ... మరీ అతిశయోక్తిగా మాట్లాడుతున్నావు సురేష్. నన్ను ఎప్పుడూ జీన్స్, షర్టులు వేసుకోమంటావు కదా!'

'లేదు మీనా... నిజంగా మనస్ఫూర్తిగా చెప్తున్నాను. అందంగా తెల్లగా పాలరాతి బొమ్మలా వుంటావు. విశాలమైన కళ్లు, కవ్వించే నడుము...' వర్ణించబోయాడు సురేష్.

మీనా అతని నోరు సుతారంగా మూసింది.

"నిన్ను వదిలి ఉండలేకపోతున్నాను సురేష్.



ఇండియాలో ఉన్న మీ పేరెంట్స్‌తో మన పెళ్లిగురించి మాట్లాడు".

'ఎందుకో రాణీగారికి పెళ్లితొందర ఎక్కువయింది. ఏం... అంతేనా?' ఏడిపిస్తూ అన్నాడు సురేష్.

* * *

మీనా, సురేష్ అమెరికాలో వేర్వేరు కంపెనీల్లో జాబ్ చేస్తున్నారు.

డిసెంబర్ నెలలో ఇద్దరూ సెలవుపెట్టుకుని ఇండియా వచ్చారు. తల్లిదండ్రులు బిడ్డల ఇష్ట ప్రకారమే పెళ్లిచేసి, తిరిగి అమెరికా పంపేసారు. ఒకే కులం కాబట్టి ఎవరికీ అభ్యంతరం లేకపోయింది. కోడలు సంపాదనపరురాలు, పైగా పెళ్లికొడుకు తండ్రి ముప్పైఐదు లక్షల కట్నం తీసుకున్నాడు. ఈ సంగతి మీనాకి తెలియకుండా దాచారు.

ఒకరోజు ఇంటర్‌నెట్‌లో మీనా తండ్రితో ఛాటింగ్ చేస్తున్న సమయంలో అనుకోకుండా భర్తను అదేపనిగా పొగుడుతున్న మీనాకి కట్నం విషయం చెబితే బాగుంటుందని చెప్పేసాడు.

ఇద్దరూ కంపెనీలలో వర్క్ అయిన తరువాత రాత్రి తొమ్మిది గంటలకు ఇంటికి వచ్చారు. భోజనాల టేబుల్ దగ్గర సురేష్‌తో అంది మీనా... 'మావగారు కట్నం తీసుకున్నారట. నేను సేలరీ గడిస్తున్నపుడు మా డాడీ దగ్గర కట్నం ఎందుకు తీసుకున్నారు...' ఉక్రోషం కనిపిస్తున్నది మీనా మాటలలో.

"మీనా... మన పెళ్లయి ఇంకా రెండు సంవత్సరాలు పూర్తికాలేదు. కట్నం తీసుకోవడం సంప్రదాయం. పైగా కట్నం వద్దంటే నాకేదో లోపం ఉందనుకుంటారు. సరే... ఆ సంగతి వదిలెయ్. కాస్త చిరునవ్వు పడేయి, ముత్యాలు ఏరుకుంటాను" విషయం మరో దోవకి మళ్లించాడు సురేష్.

* * *

ఒకరోజు సురేష్ కాఫీ తాగుతూ అన్నాడు 'మీనా... నీ పాస్‌బుక్‌లో ఉన్న డాలర్లు నా ఎక్కౌంట్‌కి మార్చు'. నెమ్మదిగా చెప్పినా నిశ్చలంగా, ధృడంగా అన్నాడు.

'ఏం ఎందుకు? నా పాస్‌బుక్‌లో నా సేలరీ ఉండకూడదా? తన సేలరీ అడిగినందుకు కోపం వచ్చింది మీనాకి.

'ఇక్కడ చాలా అప్పు చేసాను. ఆ అప్పు తీర్చాలంటే నీ సేలరీ నేను డ్రా చేయక తప్పదు' అన్నాడు చిరాకుగా.

'అదికాదు సురేష్... నాన్న ఉన్న కాస్త ఇల్లూ అమ్మేసారు. నాకే కట్నంగా సగం ఇచ్చేసారు. మిగతాది చెల్లి పెళ్లిచేయాలి అందుకని....'

'అందుకని...?' రెట్టించాడు సురేష్.

'సురేష్ అర్థంచేసుకో. మా నాన్న, అమ్మ అద్దె ఇంట్లో ఉంటున్నారు. నేనూ చెల్లీ ఇద్దరమే సంతానం. నాన్న రిటైర్ అయ్యారు. నా సేలరీలో సగం వారికి పంపుతున్నాను'.

'నాకు తెలీకుండా పంపుతావా డబ్బు? ఈసారి అలా చేసావో మంచిదికాదు. నీ సేలరీ మొత్తం నా అక్కౌంట్‌లో వేసెయ్'.

'సంసారంలో గొడవలు పనికిరావు. వెంటాడి, వేధించి, డేటింగ్‌లు చేసి, పెళ్లిదాకా తెచ్చాడు. ఛీ... ఏం మనిషి? డబ్బుకోసమే నన్ను చేసుకున్నాడు కాబోలు' అనుకుంటూనే బేంక్‌కి వెళ్లి, సురేష్ అక్కౌంట్‌లోకి డబ్బు అంతా మార్చకుండా కొంత ఉంచుకుని మిగతాది మార్చింది.

కంపెనీకి వెళ్లి పనిచూసుకుని టాక్సీలో

వస్తూంటే ట్రాఫిక్ జామ్ అయింది. ఎందుకో తల ప్రక్కకి తిప్పి చూసేసరికి సురేష్ తన కారులో ఒక అమ్మాయితో చాలా చనువుగా ప్రవర్తిస్తూ కన్పించాడు.

మీనా హృదయం భగభగ మండిపోయిం ది. ఎవరో తెలుసుకోవాలి అనుకుంది. అదే సమయంలో సురేష్ మీనాని చూసి గతుక్కుమ న్నాడు. 'ఇవాళ అయిపోయాను' అనుకున్నాడు.

రాత్రి పదిగంటలకి బెడ్‌రూమ్‌లోకి వచ్చిన సురేష్‌ని చూడగానే మీనా మండిపడి, 'ఓహో... దొరగారా... ఎంతసేపయింది వచ్చి?'... ఎకసె క్కంగా అంది.

'ఇంతకీ నీ ఉద్దేశ్యం ఏమిటో?' తెలియ నట్లు అడుగుతున్న సురేష్‌ని చూడగానే పీక పిసకాలనిపించింది మీనాకి.

'ఆమె ఎవరో... తమరు చాలా చనువుగా ఉన్నారు'.

ఇక దాస్తే లాభంలేదు, ఏనాటికైనా బయట పడవలసిందే అనుకున్నాడు సురేష్.

'ఆమె ఎవరోకాదు... మా అక్క కూతురు, నా మొదటి భార్య. పెద్దల మాట కాదనలేక చేసుకున్నాను' చాలా కూల్‌గా చెప్పాడు.

అదిరిపడింది మీనా... 'మరి నన్ను ఎందు కు పెళ్లిచేసుకున్నట్లు? వెంటాడి, వేధించి మరీ చేసుకున్నావుగదా! నన్ను ఏం చేద్దామని?...'

'అదా... నీవు అందగత్తెవు. పైగా ఉద్యోగ స్తురాలివి. ఇకనైనా నన్ను పడుకోనీ... నీ యక్షప్రశ్నలు అయ్యాయి కదా!' విషయం తేలిగ్గా తేల్చేసి, రెండు పెగ్గులు వేసుకుని పడు కున్న సురేష్‌ని ఇక ఆ బ్రహ్మదేవుడు కూడా లేపలేడని మీనాకి తెలుసు.

మీనాకి దుఃఖం పొంగిపొరలి వస్తోంది. డబ్బుకోసం, భోగవిలాసాల కోసం మరో పెళ్లి

## వడ్డాది లక్ష్మీసుభద్ర

చేసుకున్నాడు. తను అన్నీ ఇతను చెప్పినట్లు చేసింది. ఇతని కోసం తన కట్టు, బొట్టు మార్చుకుంది. జీన్స్, షర్ట్, బాబ్డ్‌హెయిర్... ఇది తన రూపం. అమెరికాలో ఉన్నప్పుడు అమెరి కన్‌లాగా ఉండాలి అనేది అతని భావన. భారతీ య సంప్రదాయం తనది. ఇంకెన్ని కోరికలు ఇతని కోసం నేను చంపుకోవాలి? అర్ధరాత్రి వరకూ ఏడ్చిఏడ్చి సొమ్మసిల్లి పడిపోయింది.

తెల్లవారుఝామున లేచి ఒక నిర్ణయానికి వచ్చింది. ఉద్యోగం వదిలి ఇండియాకి వెళ్లిపో వాలి అని. తను కోర్టుకెక్కినా తన పెళ్లి చెల్లదు. మొదటి భార్యకున్న విలువ కోర్టులో రెండో భార్యకుండదు. మగవాడి మాయ మాటలకు ఆడవారు తొందరగా లొంగిపోతారు. నేను వం చించబడ్డాను అనుకుంది.

జాబ్‌కి రిజైన్‌చేసి, తిరుగు ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకోవాలనుకొంటూ ఆఫీస్‌కి వెళ్లింది. ఆ పనులన్నీ పూర్తికావడానికి కనీసం ఒక వారం పడుతుందని చెప్పారు. చేసేదిలేక ఉసూరుమంటూ ఇంటికి వచ్చింది. ఆలోచిస్తూ ఏం చేయాలో, ఏం చేయకూడదో ఈ సమ యంలో నాకు సలహా ఎవరిస్తారు? అని అను కుంటున్న సమయంలో...

'హాయ్ డార్లింగ్... జరిగింది మర్చిపో. నన్ను ఎక్స్‌క్యూజ్ చేసేయి. చూడు మీనా డార్లింగ్... ఇవన్నీ మామూలే. వూరికే హర్ట్ అవ్వకు. సేలరీ నా అక్కౌంట్‌కి మార్చినందుకు థేంక్స్.

మీనాకి ఒళ్లు మండిపోతోంది. ఏమనాలో తోచడంలేదు. కసితీరా తిట్టాలనుంది. కానీ మాటలు రావడంలేదు. కంఠంలో దుఃఖం సుడు

లు తిరుగుతోంది.

'ఆ... బై ది బై... మా ఆఫీసర్ వస్తారు. అతని సప్పర్ ఇక్కడే. ఆ... మరొక విషయం ఏమంటే అతను నాకు ప్రమోషన్ ఇస్తానన్నాడు. మా కంపెనీలోనే నీకు మంచి ఉద్యోగం ఇస్తానన్నాడు. నువ్వు అతనికి బాగా మర్యాదలు చేయి. అతను ఏది అడిగితే అది ఇయ్యి' అని చెప్పేసి గబగబా వెళ్లిపోయాడు.

ఇదేం మనిషి...? ఆఫీసర్ వస్తున్నపుడు ఇతను కూడా ఉండాలికదా! ఇలా వెళ్లిపోతే ఎలా? పైగా ఇది అమెరికా. సోషల్‌గా మూవ్ అవ్వాలి అంటాడు. గొర్రెను చూసినట్లు చూస్తారు. నాగరికంగా వుండు అని స్పీచ్ ఇస్తాడు.

'ఏమి అనుకున్నా ఏమీ లాభంలేదు. ఇది అంతా నా దురదృష్టం. ఇప్పుడే ధైర్యంగా ఉండాలి' అనుకుంది. ఇంతలోనే...

'హాయ్... మిసెస్ సురేష్... అయామ్ జాన్సన్. ఆఫీసర్ ఆఫ్ మిస్టర్ సురేష్' అంటూ పరిచయంచేసుకుంటూ ఒక యాభైఏళ్ల అమెరికన్ వచ్చాడు లోపలికి.

'హాయ్ సర్ కమిన్... వెల్‌కమ్... ప్లీజ్... కూర్చోండి' అంటూ లేని చిరునవ్వు పులుముకుని ఆహ్వానించింది అతన్ని.

'ఇంకా వంట పూర్తికాలేదు సర్. సురేష్ ఇపుడే బజారుకి వెళ్లాడు. నేను ఒక్క ఫైవ్ మినిట్స్‌లో రెడీ చేస్తాను' అంటూ కిచెన్‌లోకి వెళ్లబోయింది.

'నో... నో... మిసెస్ సురేష్... ఫ్రిజ్‌లో ఏం ఉంటే... అవి తిందాం' వచ్చీరాని తెలుగులో మాట్లాడుతున్నాడు.

బతికాం. మంచివాడే... అనుకుంటూ మీనా ఫ్రిజ్ దగ్గరకు వెళ్లి తినుబండారాలు తెచ్చి, టీపాయ్‌మీద పెట్టింది. బ్రెడ్ జామ్‌పూసి ఇచ్చింది. ఏపిల్ పండ్లు ముక్కలు చేసి ప్లేట్‌లో పెట్టింది. అతను అవి తింటూ ఆమె అందాలను కళ్లతో జుర్రేస్తున్నాడు.

మీనాకి కంపరమొచ్చింది. తిన్న తరువాత 'లెట్స్ గో టు బెడ్‌రూమ్' అంటూ మీనా చెయ్యి పట్టుకోబోయాడు. మీనాకి గాభరా వేసింది. నిశ్చేష్టురాలయింది. లేని ధైర్యం తెచ్చుకుని, ఒక్కసారి కుడిచేయి ఎత్తి లెంపకాయ కొట్టింది. అతను బిత్తరపోయాడు. వెంటనే 'యూ బిచ్' అంటూ దగ్గరకు రాబోయాడు.

అక్కడున్న కుర్చీని అతని మీదకు విసిరేసి, ఒక్క ఉదుటన రోడ్డుమీదకు వచ్చి, టాక్సీలో భారత రాయబార కార్యాలయానికి వెళ్లింది. మానవహక్కుల సంఘానికి ఫిర్యాదు చేయగా వారు ఆ రాత్రి ఆమెకి రక్షణ కల్పించారు.

మరునాడు ఉదయం పోలీసులకు జరిగింది చెప్పి, సురేష్‌ని అరెస్ట్ చేయించింది.

'నా సంగతి ఎలా ఉన్నా, మరికొంతమంది ఆడవాళ్లని ఈ మృగం బారిన పడకుండా కాపాడగలిగాను' అనుకుంటూ తన తిరుగు ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకోవడంలో మునిగిపోయింది మీనా. ●

## డిస్కౌంట్

ఒక బట్టలషాపు తమ షాపులో కొన్న బట్టలపై 50 శాతం డిస్కౌంట్ ప్రకటించింది. 50 అంకె దగ్గర చిన్న స్టార్‌ని ఉంచింది (నిబంధనలు వర్తిస్తాయి అని చెప్పడానికి). ప్రకటనలో క్రింద ఆ స్టార్ దగ్గర వివరణ ఇలా ఉంది...

'కేవలం 15 నిమిషాలలో సెలక్షన్ పూర్తి చేసుకున్న వారికి మాత్రమే'.